మూగజీవాల ఆరోగ్యానికీ భరోసా!

- గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్యసేవలు
- అత్యవసరమైతే మూగజీవిని ప్రాంతీయ పశువైద్యశాలకు తరలింపు
- వైద్యం పూర్తయ్యాక వాహనంలోనే రైతు ఇంటికి చేరవేత
- అందరి మన్ననలు పొందుతున్న డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ పథకం


డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ వాహనం


బర్రెకు వైద్యం చేస్తున్న దృశ్యం (ఫైల్)

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలతో పాటు మూగజీవాల ఆరోగ్యానికీ భరోసా కల్పిస్తుంది. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా పథకం ద్వారా పశువులకు నాణ్యమైన వైద్య సేవలు కల్పిస్తుంది. ఈ పథకం ద్వారా అంబులెన్స్ ఏర్పాటు చేసి రైతుల విన్నపం మేరకు ఆయా గ్రామాలకు వెళ్లి మరీ వైద్యం అందజేస్తున్నారు పశువుల డాక్టర్, సిబ్బంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పశువులకు సరైన వైద్యం అందక ప్రాణనష్టం వాటిల్లి రైతులు నష్టపోయారు. పశువులు వ్యాధి బారినపడినప్పుడు మండల కేంద్రాల్లోని పశువైద్యశాలలకు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు రైతులు. అక్కడికి వెళ్లినా వైద్యుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. పశుపోషకుల సమస్యలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూగజీవాల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ప్రతిష్టాత్మకంగా డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో ప్రస్తుతం గ్రామాల్లోనే పశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. బనగానపల్లె నియోజకవర్గానికి రెండు డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. బనగానపల్లెతోపాటు మండల కేంద్రం సంజామలలో ఈ వాహనాలను ఉంచారు అధికారులు. బనగానపల్లెలోని వాహనం ద్వారా బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు మండలాలు, సంజామలలోని వాహనం ద్వారా సంజామల, కొలిమిగుండ్ల మండలాల్లోని గ్రామాల్లో పశువులకు వైద్య సేవలు లభిస్తున్నాయి. దీంతో పశుపోషకులతోపాటు ప్రతిఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామానికే పశువైద్యులు...

మూగజీవాలు తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు పశుపోషకులు 1962 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. రైతు పేరు, గ్రామం, మండలం వివరాలు తెలపడంతోపాటు పశువు ఆరోగ్య సమస్యను వివరించాలి. ఈ సమాచారం వెంటనే సంబంధిత రైతుభరోసా కేంద్రానికి చేరుతుంది. ఈ నేపథ్యంలో పశు ఆరోగ్య సేవ వైద్యబృందానికి సమాచారం అందిన వెంటనే పశువైద్య బృందం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనంలో అక్కడికి చేరుకుంటారు. పశువును పరీక్షించి వైద్య సేవలు అందిస్తారు. ఒకవేళ్ల పశువు ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉంటే హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యంతో వాహనంలోకి ఎక్కించి అందుబాటులో ఉన్న ప్రాంతీయ పశువైద్యశాలకు తరలిస్తారు. పూర్తి స్థాయిలో వైద్యం అందించి అదేవాహనంలో పశువును రైతు ఇంటికి ఉచితంగా చేరవేస్తారు సిబ్బంది.

పశుపోషణపై అవగాహన...

డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా పథకం డాక్టర్, సిబ్బంది మూగజీవాలకు వైద్య సేవలు అందజేయడంతోపాటు రైతులకు పశుపోషణపై అవగాహన కల్పిస్తున్నారు. అనారోగ్య పశువు ఉన్న చోటనే సత్వరమే పశువ్యాధి నిర్ధారణ చేసి ఖచ్చితమైన వైద్యం అందించడంతోపాటు ఆ వ్యాధి లక్షణాల తీరును రైతులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా పశుపోషణ లాభాలు, కృత్రిమ గర్భోత్పత్తి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సైతం రైతులకు వివరించి చైతన్న పరుస్తున్నారు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా పథకం డాక్టర్, సిబ్బంది.

పశువుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



పశువుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా సేవలు అందజేస్తున్నాం. పశు పోషకుల సమాచారం మేరకు అక్కడికే వెళ్లి మూగజీవాలకు వైద్య సేవలు అందజేస్తున్నాం. ప్రతి నెలా 150–200 పశువులకు వైద్య సౌకర్యం కల్పిస్తున్నాం. అదేవిధంగా పశువులకుసోకే చిన్న చిన్న వ్యాధుల లక్షణాలను రైతులకు వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. పశు వైద్యసేవలపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్న తీరు మాకు చాలా తృప్తినిస్తుంది.

– డాక్టర్ తస్లీమా నస్రున్, డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వైద్యురాలు

క్లుప్తంగా

నేటి నుంచి పాండురంగడి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో పాండురంగ విఠలేశ్వరుడు

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజు పేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. 11 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజున స్వామివారికి పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, విష్ణు అష్టోత్తర శతనామావళి, మంత్రపుష్పం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు పేర్కొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఉసేన్‌స్వామి దర్గా


ఉసేన్‌స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో దర్గా కిటకిటలాడింది. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి అలంకరించారు. ఉసేన్‌స్వామికి భక్తులు ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రంథాలయ రికార్డుల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి ప్రకాష్

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె గ్రంథాలయ కార్యాలయాన్ని ఆ శాఖ జిల్లా కార్యదర్శి కె.ప్రకాష్ గురువారం తనిఖీ చేశారు. పుస్తకాలు, దినపత్రికల రికార్డులతో పాటు పాఠకుల సంఖ్యను పరిశీలించారు. స్థానిక గ్రంథాలయ అధికారి బషీర్ అహమ్మద్‌తో మాట్లాడి పాఠకుల తీరుపై ఆరా తీశారు. అలాగే గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అరటితోట దగ్ధం


దగ్ధమైన అరటితోట వద్ద బాధిత రైతు

ప్యాపిలి: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామ శివారులో గురువారం అరటి తోటకు నిప్పంటుకుంది. గ్రామానికి చెందిన శివ వెంకటరామిరెడ్డి మూడు ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నాడు. పంట చేతికిరావడంతో మరి కొన్ని రోజుల్లో కోతకోసి విక్రయించాలని రైతు ఏర్పాట్లు చేసుకున్నాడు. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ట్రాన్స్‌ఫారంలో మంటలు చెలరేగాయి. మంటలు డ్రిప్ పైపులకు వ్యాపించి తద్వారా అరటి చెట్లు కూడా దగ్ధమయ్యాయి. మరికొద్ది రోజుల్లో కోత కోయాల్సిన అరటికాయలు దగ్ధం కావడంతో దాదాపు రూ. 3 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రమాదంలో డ్రిప్ పరికరాలు కూడా కాలిపోయినట్లు తెలిపాడు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి


వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న గ్రంథాలయ అధికారి మధు శేఖర్

బేతంచెర్ల: ప్రాచీన కాలం నుంచి నేటి వరకు విజ్ఞానం అందించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి మధు శేఖర్ అన్నారు. స్థానిక గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవివిజ్ఞాన శిబిరంలో గురువారం ఆయన ప్రారంభించారు. శిక్షకుడు జాకిర్ విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుశేఖర్ మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకు విజ్ఞాన శిబిరా లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పిల్లలు రూ. 50, పెద్దలు రూ. 100 సభ్యత్వం తీసుకోవాలన్నారు.

20న మల్లెపూల అర్చన

డోన్ టౌన్ : పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20వ తేదీన సోమవారం సాయంత్రం 6.30గంటల నుంచి లక్ష మల్లెపూల అర్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు వేంకటేశ్వర సహస్ర నామావళి పుస్తకాలు, స్వామివారి కార్డులు, మల్లెపూలు అందజేస్తామన్నారు. పూజ అనంతరం భక్తులకు మల్లెపూలు, తీర్థ ప్రసాద వితరణ చేస్తామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : డోన్–బేతంచెర్ల 44బి జాతీయ రహదారి పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న మల్కాపురం ఫీడర్ 33 కేవీ లైన్ మార్పుల కారణంగా మల్కాపురం, రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, ఫ్యాక్టరీలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7గంటల వరకు కరెంటు ఉండదన్నారు. అదేవిధంగా డోన్ ఇండస్ట్రియల్ సబ్ స్టేషన్‌లో 11 కేవీ కన్నపకుంట ఫీడర్ మార్పిడి కారణంగా వ్యవసాయానికి త్రీ ఫేస్ కరెంటు ఉదయం 6గంటల నుండి 1గంట వరకు ఉంటుందని వివరించారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో రోడ్డు విస్తరణ పనులను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధుసూధన్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు, పరిశ్రమల యజమాన్యాలు గమనించాలని సూచించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

కోవెలకుంట్ల: జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిలో జీలుగ విత్తనాల పూర్తిధర రూ. 88 కాగా 50 శాతం సబ్సిడీ పోనూ రూ. 44 ప్రకారం సరఫరా చేస్తున్నామన్నారు. వరి సాగు చేసే రైతులు పొలంలో భూసారం పెంచుకునేందుకు జీలుగ విత్తనాలు వేసుకోవాలని సూచించారు. మండలంలోని రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుని విత్తనాలు పొందాలని సూచించారు.

శిలా ఫలకం ధ్వంసం


శిలాఫలకంపై ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి చిత్రాలను ధ్వంసం చేసిన దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటలో గురువారం వైఎస్సార్‌సీపీకి చెందిన శిలా ఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వసం చేశారు. చెరువు సమీపం నుంచి తాళ్లవరకు రైతులు రాకపోకలు సాగించేందుకు గ్రావెల్ రోడ్డును రూ.20 లక్షలతో నిర్మించారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. మే13న జరిగిన పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పనిగట్టుకొని గొడవకు దిగారు. ఆ వివాదాన్ని మనసులో పెట్టుకొని టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగానే శిలఫలాకాన్ని ధంసం చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్ ఫొటోలను రాళ్లతో ధ్వంసం చేశారన్నారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు శిలాఫలకాన్ని పరిశీలించారు.

నేడు బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు


వీరబ్రహ్మేంద్రస్వాముల మూల విరాట్

డోన్ టౌన్ : పట్టణంలోని నెహ్రూనగర్‌లో వెలిసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పత్యేక పూజలతో పాటు మహామంగళ హారతి, అన్న సంతర్పణ ఉంటుందన్నారు. అదేవిధంగా సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున పల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో పోలీసులకు గాయాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని యు.కొత్తపల్లె జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ నాగార్జున, హోంగార్డు ప్రసాద్‌కు గాయాలు అయ్యాయి. రూరల్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న వీరు విధి నిర్వాహణలో భాగంగా ఉదయం బైకుపై కొత్త బురుజు గ్రామానికి వెళ్లి తిరగి డోన్‌కు బయలుదేరారు. యు.కొత్తపల్లె వద్ద బైకును లారీ ఢీ కోనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ సుధాకర రెడ్డి హుటా హుటిన సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను చికిత్సల నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామాంజనేయులుపై గురువారం అదే కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఎన్నికల పోలింగ్ రోజున 14వ బూత్ వద్ద జరిగిన ఘర్షణకు ప్రతీకారంగా దాడికి పాల్పడ్డారు. ఇంటి వద్ద ఉన్న రామాంజనేయులు టీడీపీ కార్యకర్తలు పెద్ద ఓబన్న, చిన్న ఓబన్న, చిన్న రామన్నతో పాటు మొత్తం ఆరు మంది దాడికి పాల్పడ్డారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

వ్యక్తి మృతిపై 21న విచారణ

బొమ్మలసత్రం: నంద్యాల ఉప కారాగారంలో రిమాండ్ ముద్దాయిగా ఉన్న అనకాపల్లి జిల్లా రోళ్లగుంట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన కొండలరావు అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా గత ఏడాది నవంబర్ 13న కర్నూల్ సర్వజన ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆయన మృతిపై బహిరంగ విచారణ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఎవరైనా అభ్యంతరాలు తెలియజేయదలుచుకుంటే ఆర్డీఓ కార్యాలయంలో నేరుగా సంప్రదించి, వాంగ్మూలం ఇవ్వాలని ఆర్డీఓ కోరారు.

అడల్ట్ బీసీజీ టీకా వేయించుకోవాలి


డోన్ పట్టణంలో ఓ వృద్ధుడికి బీసీజీ టీకా వేస్తున్న సిబ్బంది

డోన్ టౌన్ : వృద్ధులు, షుగర్, పొగతాగే తదితర వ్యక్తులు టీబీ నివారణకు బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ షాబాజ్ హుస్సేన్ సూచించారు. పట్టణంలోని 13వ సచివాలయంలో గురువారం అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో టీబీ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అడల్ట్ బీజీసీ టీకా కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రతి గురువారం ఈ వ్యాక్సిన్ వేస్తామన్నారు. పూర్తి వివరాలకు టీబీ, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్స్ అరుణ్‌కుమార్, కరీముల్లా, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు బీసీజీ టీకాలు


కోవెలకుంట్లలో వృద్ధులకు బీసీజీ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు, మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గురువారం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు బీసీజీ టీకాలు వేసినట్లు డాక్టర్లు విద్యాసాగర్, రాబర్ట్ కెన్నెడి తెలిపారు. వృద్ధులు క్షయవ్యాధి బారిన పడకుండా ముందుజాగ్రత్త చర్యగా టీకాలు వేస్తున్నామన్నారు. 60 ఏళ్లపైబడిన వృద్ధులు, షుగర్‌వ్యాధిగ్రస్తులు, దూమపానం చేసే వ్యక్తులకు టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నెల రోజులపాటు కొనసాగుతుందని, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు, ప్రభావతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


బేతంచెర్ల: భవిష్యత్తులో టీబీ రాకుండా ప్రభుత్వం బీసీజీ వ్యాక్సిన్ ప్రవేశ పెట్టిందని వైద్యులు తస్లీమా, ప్రియాంక అన్నారు. పట్టణంలోని గౌరిపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు మునేశ్వరి, దుర్గ, లక్ష్మి, తిప్పమ్మ, రేణుక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధుల నుంచి రక్షణ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్యాపిలి: దోమలను నివారించడం ద్వారానే డెంగీ, మలేరియా తదితర వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైద్యాధికారులు వాణిశ్రీ, నితీశ్ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఏడీస్ దోమ కాటుతో డెంగీ జ్వరం వస్తుందన్నారు. మురికి నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం పలు సచివాలయాల పరిధిలోని 60 సంవత్సరాల పైబడిన వారిని గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మనోహర్ రెడ్డి, శ్రీనివాస్, మల్లికార్జున, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడు మృతి


మృతుడు చరణ్ (ఫైల్)

డోన్ టౌన్ : పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బుధవారం రాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు దాసరి చరణ్ కుమార్ (17) కోలుకోలేక మృతి చెందినట్లు పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. వెంకటాపురం రోడ్డులో పేరంటాలమ్మ గుడి సమీపంలో నివాసం ఉంటున్న తారకరామనగర్‌కు చెందిన దాసరి పెద్ద మద్దిలేటి కుమారుడు మృతుడు చరణ్, ఇదే ప్రమాదంలో గాయపడిన వెల్దుర్తి మండలం మల్లెపల్లెకు చెందిన గొల్ల జగదీష్ పట్టణంలోని ఒక ఆటో బాడీ వర్క్స్ షాప్‌లో పని చేస్తున్నారు. బుధవారం రాత్రి పని చేసే సమయంలో జగదీష్ కంటిలో ఇనుప ముక్క పడటంతో జాతీయ రహదారి సాయిబాబా గుడి సమీపంలో ఉన్న కంటిలో నలుసు తీసే వారి దగ్గరికి బైకుపై వెళ్లి తిరిగి బయలుదేరారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బైకు అదుపు తప్పి వైడర్‌ను ఢీకొట్టడడంతో గాయపడిన ఇద్దరిని కర్నూలు వైద్య శాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక చరణ్‌కుమార్ మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. జగదీష్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాటి ముంజలు... తింటే మేలు!


బనగానపల్లె పట్టణం పోలీస్ స్టేషన్ సమీపాన తాటిముంజెలను విక్రయిస్తున్న వ్యాపారులు

బనగానపల్లె రూరల్ : తాటి ముంజలు ఒకప్పుడు పల్లెలకే పరిమితం. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. పట్టణాల్లో సైతం తాటి ముంజలు తింటే మేలు అంటున్నారు. వీటి ప్రయోజనాల గురించి ప్రముఖ వైద్యులు సైతం వివరిస్తుడడంతో ప్రతిఒక్కరూ ముంజలు తనడానికి ఆసక్తి చూపుతున్నారు. వేసవిలోనే లభించే వీటికి పూర్తిగా డిమాండ్ పెరిగింది. పట్టణాల్లోని ప్రధాన రోడ్ల వెంట ముంజల అమ్మకాలు సాగుతున్నాయి. బనగానపల్లె మండలంలో ఎక్కువగా పసుపల, చిన్నరాజుపాళెం, పెద్దరాజుపాళం, తండా, చెర్లోకొత్తూరు, కాలేనాయక్‌తాండా, రాళ్లకొత్తూరుతండా గ్రామాల్లో తాటి ముంజలు లభిస్తాయి. బనగానపల్లెకు తీసుకొచ్చి డజన్ రూ.70–రూ.80 చొప్పున తాటిముంజెలను విక్రయిస్తున్నారు. కూలి బాగా గిట్టుబాటు అవుతుందని ముంజల విక్రయదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తజన సందడి


మహానందీశ్వరుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మహానంది: వేసవి సెలవులు ఉండటంతో మహానంది ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తుండటంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం జరిగిన అష్టవిధ మహామంగళ హారతుల సమయంలో సాధారణ, శీఘ్రదర్శనం క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండి భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కోదండరామాలయం, వినాయనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు. ప్రసాదాల కోసం గంటల తరబడి నిరీక్షించి ప్రసాదాలను కొనుగోలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులరద్దీ కొనసాగింది.

మహానందీశ్వరస్వామి ఆభరణాల పరిశీలన

మహానందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన బంగారు, వెండి ఆభరణాలను పరిశీలించే కార్యక్రమం చేపట్టారు. గతంలో ఇక్కడ ఈఓగా పనిచేసి ప్రస్తుతం కాళహస్తి ఏసీ మల్లికార్జున ప్రసాద్ గురువారం మహానంది దేవస్థానం కార్యాలయానికి చేరుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బందితో సమావేశమయ్యారు. స్వామి వారికి చెందిన బంగారు, వెండి ఆభరణాలు, వస్తువుల వివరాలను పరిశీలించారు. వివిధ బ్యాంకుల లాకర్లలో నిల్వ ఉంచిన వాటితో పాటు స్వామి, అమ్మవార్లకు అలంకరించిన, భక్తులు సమర్పించిన వస్తువుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తిస్థాయిలో రికార్డుల్లో పొందుపరిచారు.

వెదుర్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సైకిళ్లను చూపుతున్న అటవీశాఖ అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలం నారపురెడ్డి కుంట సెక్షన్‌లోని బాలయ్యకుంట, మలుపుల చెరువు ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన దాడుల్లో 16 సైకిళ్లపై తరలిస్తున్న వెదుర్లను స్వాధీనం చేసుకున్నట్లు బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా తెలిపారు. రూ. 40వేల విలువైన 500 వెదుర్లను స్వాధీనం చేసుకుని మహానంది మండలం గాజులపల్లె ఆర్ఎస్‌లోని అటవీడిపోకు తరలించామన్నారు.

అనుమతి లేకుండా అడవుల్లోకి వెళ్లడం, అటవీ సంపదను అక్రమంగా తరలించడం చేస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్ర నాయక్, సిబ్బంది పీవీ సుబ్బయ్య, రవీంద్రనాయక్, తేజ, మదార్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతన్న


ట్రాక్టర్‌తో పంటపొలంలో దుక్కులు దున్నుతున్న రైతన్న

బేతంచెర్ల : ఖరీఫ్ సాగుకు రైతన్న సిద్ధం అవుతున్నాడు. మండలంలో సుమారు 14,500 హెక్టార్లు సాగుభూమి ఉంది. వారం రోజుల నుంచి అడపదడపా వర్షాలు పడుతుండటంతో దుక్కులు దున్నుతున్నారు. మండలంలో 70 శాతం రైతులు వర్షాలపై వ్యవసాయం చేస్తున్నారు. ఖరీఫ్‌లో ముఖ్యంగా కందులు, జొన్నలు, కొర్ర, పత్తి, మినుము, వేరుశనగ పంటలు సాగు చేస్తారు. ఈ మేరకు పొలాల్లో ఉన్న జొన్న, కంది కొయ్యలను తొలగిస్తున్నారు. 70 శాతం ఎర్రమట్టి నేలలు, ఇసుక నేలలు, 30 శాతం నల్లరేగడి నేలలు ఉన్నాయి. ఎర్రమట్టి నేలల్లో కంది, వేరుశనగ, కొర్ర, సజ్జ పంటలను సాగు చేస్తారు.